క్లుప్తంగా

వైభవంగా గ్రామదేవత ఉత్సవాలు



ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

పోలాకి: మండలంలోని రాళ్లపాడు పంచాయతీ ముప్పిడి గ్రామదేవత ఉత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. స్థానికుల ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యేకు పార్టీలకు అతీతంగా గ్రామస్తులంతా సన్మానం చేశారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే కృష్ణదాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలన్నారు.

జగనన్న కిట్లు పరిశీలన



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ పగడాలమ్మ

హిరమండలం: జగనన్న విద్యా కానులక కిట్లు పంపిణీకి పగడ్బందీగా ఏర్పాటు చేయాలని టెక్కలి డిప్యూటీ ఈఓ జి.పగడాలమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్లు భద్రపరిచే స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీలతో సమీక్షించారు. మండలంలోని పాఠశాలల వారీగా విద్యా కానుకలు పేర్చుకోవాలన్నారు. భద్రపరిచే రూమ్‌లో చెదలు పట్టకుండా చూసుకోవాలన్నారు. వచ్చిన వస్తువులు నాణ్యత చూసుకుని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం మనబడి నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎంఈఓ కె.రాంబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యు.ఎ స్.ఎస్.మూర్తి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గా హోమం



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

సారవకోట: మండలంలోని శివరాంపురం గ్రామంలో శివమణి దుర్గా ఆలయంలో మంగళవారం దుర్గా హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ 14వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త దివ్వల లక్ష్మీనారాయణ దంపతులతో దుర్గా హోమాన్ని పురోహితులు మనోజ్ శర్మ చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘటాలతో ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ చేపట్టారు.

45 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు: మండలంలోని ఒంద్రుజోల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా 45 మందికి వైద్యాధికారి తేజేశ్వరి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్ పక్షవాతంతోపాటు పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు పలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గంధవరపు నాగేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మెడికల్ అధికారి వంశీకృష్ణ

జలుమూరు: స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు వైద్య ఆరోగ్య సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జలుమూరు మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. బుధవారం బ్రైటర్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి పునశ్చరణ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. దీర్ఘకాలిక రోగులు కుష్టు, ఎయిడ్స్, ఫైలేరియా వారి కోసం నరసన్నపేటలో ప్రత్యేకంగా కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం

పొందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభించనున్నామని ఎంపీపీ కిల్లి ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరుకానున్నారని చెప్పారు. నాయకులు, అధికారులు, హాజరుకావాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్లు



సమీక్షలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: అర్హత కలిగిన వారందరికీ ఇల్లు మంజూరు చేసి అందించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీ లే అవుట్‌లలో, పలు గ్రామాల్లో నిర్మిస్తున్న గృహనిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణశాఖ, ఆమదాలవలస, బూర్జ మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన అభిమతమని తెలిపారు. ఇక్కడ 8978 గృహాలు నిర్మాణంలో ఉండగా కొత్తగా 3000 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి పక్కా గృహం కలిగి ఉండాలన్నదే, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమతమన్నారు. గడపగడపకూ కార్యక్రమంలో ప్రజలతో ముఖాముఖి మాట్లాడానని, ప్రతి గ్రామంలోనూ పక్కాగృహాల కోసం వినతులు వచ్చాయని చెప్పారు. కొత్తగా వచ్చిన ఇళ్లను అర్హులకు కేటాయించాలని సూచించారు. లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆదేశించారు.హౌసింగ్ పీడీ గణపతి, ఈఈ మోహన్ రావు, డీఈ చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, బూర్జ తహసీల్దార్ ఎస్.రమణారావు, ఆమదాలవలస తహసీల్దార్ గణపతి సర్వేయర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

నరసన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎ.సింహాచలం హెచ్చరించారు. పట్టణంలో పలే ఆక్రమణలను గుర్తించి వాటిని మంగళవారం తొలగించామని తెలిపారు. డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గంలో సత్యవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకోవడానికి స్థానికులు ప్రయత్నించగా అడ్డుకున్నట్లు తెలిపారు. ధర్మ కోనేరు వద్ద కూడా ఆక్రమణలు తొలగించామన్నారు. ఆక్రమణలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. సర్వే చేసి ఎస్ఎల్ఆర్ ప్రకారం కొలతలు వేసి మార్కింగ్‌లు ఇచ్చామని, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు చేస్తే నేరమని బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



కాలువ వద్ద ఆక్రమణలు తొలగించి బోర్డులు పెట్టించిన అధికారులు

ఈఓ సింహాద్రి నాయుడు, ఆర్ఐ అన్వేష్, వీఆర్వోల అప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

పొందూరు: ఈ నెల 13న స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ కోరారు. స్థానిక పోలీసులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు. రాజీపడేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీకి అనుకూలమైన కేసులను మాత్రమే పరిష్కారం చేస్తామన్నారు. పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి తిరువీధి



స్వామివారి తిరువీధిలో పాల్గొన్న భక్తులు

జలుమూరు: గొటివాడ గ్రామంలోని సత్యనారాయణ ఆలయ ప్రతిష్ట కారక్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీరువీధి నిర్వహించారు.

గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఆమదాలవలస రూరల్: గ్యాస్ వినియోగంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ జి.కోటేశ్వరరావు అన్నారు. మండలంలో కట్యాచార్యులపేట గ్రామ సచివాలయంలో శివానీ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో గ్యాస్ వాడకంపై మంగళవారం అవగాహన కల్పించారు. వంట ముగిసిన వెంటనే గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని సూచించారు. చిన్నపాటి తప్పిదాలు వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయన్నారు. సురక్షితమైన ట్యూబ్‌లను వాడకం చేయాలని, లేకుంటే లీకేజీ సమస్యలు వస్తాయన్నారు. సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న పలాసకు చెందిన కె.అశ్విన్‌కు పూండికి చెందిన యువతరం సేవా సమితి అండగా నిలిచింది. వైద్యం కోసం 15 వేల రూపాయలను మంగళవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. అశ్విన్ కొంతకాలంగా సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటికే లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వైద్యం అందించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. మరో రెండు వారాలు చికిత్సతోపాటు మందులు అందిచాల్సి ఉంది. అశ్విన్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న యువతరం సేవా సమితి సభ్యులు తమవంతు సాయం చేశారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, అన్నెపు లక్ష్మణ్‌రావు, జి.సునీల్, కె.రేవతీపతి, ఎం.వెంకట్, టి.శ్రీదేవి, అమృత ఉన్నారు.

సందడిగా సిరిమానోత్సవం



మానును అలంకరిస్తున్న గ్రామస్తులు



సిరిమానుపై దాసుడు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 40 అడుగుల సిరిమానును మంగళవారం తిరువీధి నిర్వహించారు. మానును 10 వేల చీరలతో అలంకరించారు. గ్రామానికి చెందిన మెండ దాలప్పన్న (దాసుడు) మాను చివర కూర్చొని అశేష జన వాహిని నడుమ తిరువీధి చేపట్టారు. గ్రామదేవత చెవిటమ్మ తల్లి ఆలయంలో తొలుత ప్రత్యేక విశేష పూజలు నిర్వహించి అనంతరం ఈ సిరిమాను ఉత్సవాన్ని ప్రారంభించారు. గ్రామంలో ప్రతీ 10 సంవత్సరాలకు సిరిమాను ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుండేది. 2008లో నిర్వహించిన ఈ ఉత్సవాలు కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చి ఈ ఏడాది నిర్వహించినట్లు సర్పంచ్ పంచిరెడ్డి పద్మావతి తెలిపారు. కాళీ మాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు హాజరుకావడంతో గ్రామంతా కిటకిటలాడింది. ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

భక్తిశ్రద్ధలతో చెవిటమ్మ తల్లి పండగ



కుంటిభద్రలో ఘటాలతో తిరువీధి నిర్వహిస్తున్న మహిళలు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామ దేవత చెవిటమ్మ తల్లి పండగలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ పండగకు ఈ ప్రాంతంలో ప్రత్యేకత ఉంది. 550 ఘటాలతో తీరువీధి నిర్వహించారు. అమ్మవారిని ముర్రాటలతో చల్లదనం చేశారు. కాళీమాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యుత్ దీపాలో అలంకరించారు.



ఆకట్టుకున్న వేషధారణలు

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



కొత్తూరు: రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఏ బాబాజీ



బూర్జ: బూర్జలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది, మహిళలు

కొత్తూరు: రానున్న ఖరీఫ్‌లో రైతుకు ఉన్న మొత్తం భూమిలో నవధాన్యాలు సాగు చేయాలని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ యాంకర్ బాబాజీ సూచించారు. మండలంలోని లబ్బ గ్రామంలో ఖరీఫ్ సాగుపై యాక్షన్ ప్లాన్‌ను వివరిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగు వల్ల పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. దీని ద్వారా భూసారం పెరగడంతోపాటు ఆరోగ్యవంతమైన పంటలు సాగు చేయవచ్చన్నారు. మహిళా రైతులు,వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: నవధాన్యాల సాగుపై మాస్టర్ ట్రైనీ చిన్నమ్మడు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖరీఫ్ ప్రణాళిక కోసం 8 గ్రామ సంఘాల ద్వారా సర్వే నిర్వహించారు. ఖరీఫ్ ప్రధాన పంటకు ముందు నవధాన్యాలు సాగుచేయడం వల్ల జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు. వ్యవసాయ సిబ్బంది, వీఓఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రూ.2 లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్ అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నర్సిపురం గ్రామానికి చెందిన చాప హరికృష్ణ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. దీంతో వారి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రెండు లక్షల రూపాయలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మృతుని తల్లి అదిలక్ష్మికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్ పిచ్చుక అజయ్, గుజ్జు జోగారావు, సనపల సింహాచలం, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, నీలాపు నారాయణ పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



స్కిల్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: యువతకు ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని, యువత అవకాశాలను సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌ను మంగళవారం ప్రారంభించారు. గిరిజన ప్రాంతాల్లోని యువతకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయిశ్రీనివాసరావు, జిల్లా టూరిజం శాఖాధికారి నారాయణరావు, ప్రిన్సిపాల్ సూర్య చంద్ర, వైస్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పనుకు మోహన్, వై.సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులున్న వారందరికీ ఉపాధి కల్పించాలి



సరుబుజ్జిలి: రొట్టవలసలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

సరుబుజ్జిలి: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని కల్పించడం జరుగుతుందని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు తెలిపారు. మండలంలోని రొట్టవలస అమృత్ సరోవర్ చెరువు పనులు మంగళవారం పరిశీలించారు. గట్టును అభివృద్ధి చేయడం , ట్రెంచ్ ఏర్పాటుతోపాటు, గట్టుపై మొక్కలు అధికంగా పెంచి పార్కు మాదిరిగా తయారు చేయాలని సూచించారు. గరిష్ట వేతనం అందేలా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఏపీడీ రాధ, ఏపీఓ పార్వతి పాల్గొన్నారు.

హిరమండలం: ఉపాధి పథకం ద్వారా పనులు చేపడుతున్న వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయలంలో హిరమండలం క్లస్టర్ పరిధిలోని పాతపట్నం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు సంబంధించిన ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వేతనదారుల సంఖ్యను పెంచాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఏపీడీ పి.రాధ, ఎంపీడీఓ బి.శైలజ, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వైశాఖ మాసం మొదటి మంగళవారం సందర్భంగా ఆలయానికి స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు. అమ్మవారిని జిల్లా టూరిజంశాఖ అధికారి నారాయణరావు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వాసుదేవరావు, సిబ్బంది ఆహ్వానించారు. ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారావు, సుదర్శనరావు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



1997-2002 బ్యాంచ్‌కు చెందిన విద్యార్థులు కుటుంబ సభ్యులు

కొత్తూరు: మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–2002 వరకు విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో మంగళవారం కలుసుకున్నారు. 21 ఏళ్ల తరువాత కలవడంతో అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వాట్సప్ గ్రూప్ ద్వారా కలయిక జరిగిందని పూర్వ విద్యార్థి మాతల రాజేష్ చెప్పారు.

ఘటం.. అపురూప ఘట్టం



జమ్ములో ఘటాల అనుపు పండగ మంగళవారం ప్రశాంతంగా వైభవంగా జరిగింది. జానపద నృత్యాలు, కోలాటాలు, తప్పెట గుళ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అసిరితల్లి గ్రామ దేవత అమ్మవారికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ముర్రాటలు సమర్పించారు. సర్పంచ్ వాన గోవిందరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.
– నరసన్నపేట